క్లుప్తంగా

ఎల్‌ఓసీల పంపిణీ

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో అత్యవసర వైద్య సహాయం నిమిత్తం మంత్రి తుమ్మల సిఫార్సుతో అందించే ఎల్‌ఓసీలను బాధితులకు మేయర్ పునుకొల్లు నీరజ శనివారం అందించారు. 28వ డివిజన్ కార్పొరేటర్ గజ్జెల లక్ష్మీవెంకన్న, పోకల ఉమామహేశ్వరరావు, అంకాల భద్రం, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను తగ్గింపు పేరుతో వసూళ్లు?

ఖమ్మంరూరల్: మండలంలోని గుదిమళ్ల, మద్దులపల్లిలో కొందరు వ్యక్తుల నుంచి మీరు కట్టే ఆదాయ పన్నును తగ్గిస్తామని చెబుతూ ఓ మహిళ ఒక్కొక్కరి నుంచి రూ.6వేలు చొప్పున వసూల్ చేస్తున్నట్లు తెలిసింది. అదే విధంగా కట్టిన డబ్బుల కంటే కొద్దికాలంలోనే రెట్టింపు ఇస్తామని నమ్మబలుకుతూ సదరు మహిళ ఇప్పటికే రూ.లక్షల్లో వసూలు చేసినట్లు సమాచారం.

డీపీఆర్వో కార్యాలయం మార్పు

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్‌లోని జిల్లా పౌర సంబంధాల అధికారి(డీపీఆర్వో) కార్యాలయాన్ని గ్రౌండ్ ఫ్లోర్ నుంచి మొదటి అంతస్తులోకి మార్చారు. ఇక నుంచి మొదటి అంతస్తులోని ఎఫ్–3 ద్వారా కార్యకలాపాలు కొనసాగుతాయని డీపీఆర్వో ఎంఏ.గౌస్ తెలిపారు.

నియామకం

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్యవైశ్య సంఘం నగర ఉపాధ్యక్షుడిగా వల్లాల యుగంధర్‌ను శనివారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపి సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. యుగంధర్ ఎన్నిక పట్ల పలువురు అభినందించారు.

అన్నదానం

ఖమ్మంరూరల్/ఖమ్మంమామిళ్లగూడెం: మండలంలోని పెదతండాలో గల మెఫీ మానసిక దివ్యాంగుల అనాథ‌శ్రమంలో ఖమ్మం నగర బీసీ సంఘ నాయకుడు కన్నం ప్రసన్నకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా శనివారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అనాథాశ్రమ నిర్వాహకులు ప్రమీల, అన్వేష్, నాగేశ్వరావు, వేముల విజయ్, నాగేశ్వరరావు, కన్నం రమేష్, బచ్చ సాయి, జగదీష్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

కామేపల్లి: మండలంలోని జోగ్గూడెం ప్రభుత్వ పాఠశాలలో గత 12 ఏళ్లుగా ఉపాధ్యాయులుగా పని చేస్తూ బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎం గరికపాటి సాగర్, ఉపాధ్యాయుడు చిలుముల నాగయ్యకు శనివారం గ్రామస్తులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం వారు పాఠశాల అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బద్రి, కాంతి, ద్రౌపతి, జర్పుల రవీందర్, రమేష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

10 మందికి నోటీసులు..

నేలకొండపల్లి: నేలకొండపల్లి పంచాయతీ పరిధిలో రహదారులపై గేదెలు కట్టేయడం, రోడ్డుపైనే చెత్త డంపింగ్ చేసిన 10 మందికి శనివారం పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు కార్యదర్శి దేవేందర్ తెలిపారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్న క్రమంలో రెండు రోజుల్లో రోడ్డుపై ఇలాంటి ఏమి ఉండొద్దని ఆదేశించారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

నేలకొండపల్లి: స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ సూచించారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ పాలన మాదిరిగానే కాంగ్రెస్ పాలన ఉందన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు భువనాసి దుర్గారావు, మన్నె కృష్ణారావు, పాగర్తి సుధాకర్, సూరేపల్లి జ్ఞానరత్నం, సంతోష్‌రెడ్డి, సయ్యద్ మోహినుద్దీన్, ఇస్లావత్ నాగేశ్వరరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కామేపల్లి: రైతులు పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి భూక్యా తారాదేవి అన్నారు. శనివారం మండలంలోని కామేపల్లి, తాళ్లగూడెం గ్రామాల్లో పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. పత్తిలో వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని, వ్యవసాయాధికారుల సూచనలు రైతులు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ, రైతులు పాల్గొన్నారు.

భూ వివాదంలో నలుగురిపై కేసు

ఖమ్మంరూరల్: మండలంలోని పల్లెగూడెంకు చెందిన బండి ఉపేందర్ తన స్థలంలో శనివారం గోడ నిర్మిస్తుండగా అదే గ్రామానికి చెందిన కొమరబత్తిని సంజీవరావు, ప్రియ, సాయి, రుషి అడ్డుకున్నారు. అంతేకాక గోడ కూల్చి అక్కడి నుంచి వెళ్లిపోవాలని బెదిరించడంతో ఉపేందర్ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.



శ్రీనివాసనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సేవలు మెరుగుపడ్డాయి. నగరంలో ఇలాంటివి నాలుగు సెంటర్లు ఉన్నా.. బాధితులు ఎక్కువ మంది వస్తున్నా సేవలందిస్తున్నారు. నగరంలో ప్రభుత్వ పెద్దాస్పత్రి ఉన్నా.. ఇక్కడకే వస్తున్నారంటే వైద్యుల పనితీరుపై నమ్మకాన్ని అర్థం చేసుకోవచ్చు. పరిధి ఎక్కువ కావడంతో రోజు రోజుకి ఓపీ సంఖ్య కూడా పెరుగుతోంది. కానీ సరిపడా సిబ్బంది లేకపోవడంతో సెంటర్‌లోని ఉద్యోగులపై భారం పడుతోంది.

– ఖమ్మంవైద్యవిభాగం

ఆరోగ్యమస్తు..!



శ్రీనివాస్‌నగర్ ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు భేష్

- పెరుగుతున్న ఓపీల సంఖ్య
- పెద్దాస్పత్రి ఉన్నా ఈ సెంటర్ వైపే ఆసక్తి
- అవసరం మేరకు లేని ఆశ కార్యకర్తలు
- పరిధి ఎక్కువ కావడంతో ఉద్యోగులపై భారం

సండే స్పెషల్

2000 సంవత్సరంలో ప్రారంభం..

నగరంలో సేవా భారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన 2000 సంవత్సరంలో పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత 2016 నుంచి వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోకి వెళ్లి శ్రీనివాసనగర్ యూపీహెచ్‌సీగా కొనసాగుతోంది. అయితే ఇక్కడ ఒక డాక్టర్, ఒక స్టాఫ్ నర్స్, ఐదుగురు ఏఎన్‌ఎంలు, ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, డీఈఓలు ఒక్కొక్కరు చొప్పున విధులు నిర్వర్తిస్తుండగా.. ఒక సీఈఓ, సపోర్టింగ్ స్టాఫ్ ఇద్దరితో వైద్య సేవలు అందిస్తున్నారు. కాగా, ఈ సెంటర్ పరిధి ఎక్కువగా ఉండడంతో ఆయా పరిధిలోని జనాలు ఇక్కడకే వస్తుండడంతో సెంటర్‌పై భారం పడుతోంది.

పెరుగుతున్న ఓపీ..

శ్రీనివాసనగర్ సెంటర్ పరిధి ఎక్కువగా మాస్ ప్రాంతం కావడంతో పలు ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం ఉంటోంది. వర్షాలు కురిసిన సమయాన మురికికూపంగా తయారై దోమలు వృద్ధి చెంది వ్యాధుల బారిన పడుతున్నారు. దీంతో బాధితుల తాకిడి ఎక్కువై నిత్యం 70 నుంచి 80 మంది ఓపీలు వస్తున్నారు. ప్రతీ గురువారం గర్భిణుల కోసం ప్రత్యేక ఓపీ నిర్వహిస్తుండగా.. 25 నుంచి 30 మంది వరకు వైద్య పరీక్షల కోసం వస్తున్నారు. ఆశ కార్యకర్తల ద్వారా నమోదు చేసుకున్న గర్భిణుల వివరాల ప్రకారం.. ప్రసవం అయ్యేంత వరకు వారిని పర్యవేక్షిస్తుంటారు. ఈ సెంటర్‌లో రేబిస్, పాముకాటు వంటి వాటికి వ్యాక్సిన్లు ఇవ్వడంతో పాటు ఎన్‌సీడీ కార్యక్రమం ద్వారా నిత్యం బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు మందులు అందిస్తున్నారు. అలాగే ప్రతీ శనివారం సెంటర్ పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్లలో ఇమ్యూనైజేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంటారు. ఈ సెంటర్‌లో మందుల కొరత కొంత మేర వేధిస్తుండగా.. అవసరం మేరకు సిబ్బంది సెంట్రల్ డ్రగ్ స్టోర్‌కు వెళ్లి తీసుకొస్తున్నారు.

సిబ్బంది లేక ఇబ్బంది..

అయితే ప్రతీ 2 వేల జనాభాకు ఒక ఆశ కార్యకర్త ఉండాల్సి ఉంది. కానీ ఈ సెంటర్ పరిధిలో కేవలం 9 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక్కడి జనాభా ప్రాతిపదికన చూస్తే సుమారు 25 మంది కావాల్సి ఉంది. కానీ అంతమంది లేకపోవడంతో ఇంటింటికి వెళ్లి ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించడం ఇబ్బందిగా మారింది. ప్రస్తుతం ఆరోగ్య కేంద్రం ఆదివారం మినహా ప్రతీ రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటోంది. గత ఏడాది ఇద్దరు స్టాఫ్ నర్సులు ఉండడంతో ఉదయం 8 నుంచి సాయంత్రం 8 గంటల వరకు వైద్య సేవలు అందించేవారు కానీ ప్రస్తుతం ఒకరు మాత్రమే ఉండడంతో సేవలు అందించడం కష్టంగా మారింది. మరో స్టాఫ్ నర్సును కేటాయించి 12 గంటల పాటు సేవలందించాలని ప్రజలు కోరుతున్నారు.

12 డివిజన్లకు ఇదొక్కటే..

నగర పాలక సంస్థ పరిధిలోని 12 డివిజన్లకూ ఈ ఒక్క సెంటరే దిక్కయింది. దీనిలో 17వ డివిజన్‌తో పాటు 27 నుంచి 37వ డివిజన్లు ఉండగా.. అందులో ముఖ్యంగా శ్రీనివాసనగర్, ప్రకాశ్‌నగర్, పంపింగ్‌వెల్ రోడ్, గాంధీచౌక్, గాంధీనగర్, మోతెనగర్ ప్రాంతాల్లో అధిక జనాభా ఉన్నారు. ఈ ప్రాంతాల్లో ఇమ్యూనైజేషన్, ఇతర కార్యక్రమాలు నిత్యం కొనసాగిస్తుంటారు. గతంలో ఈ సెంటర్ పరిధిలో 50 వేలకు పైగా జనాభా ఉండగా.. గోళ్లపాడు చానల్‌పై పార్కులు ఏర్పాడడంతో అక్కడి వారిని ఖాళీ చేయించారు. దీంతో ప్రస్తుతం 42,721 మంది జనాభా ఉన్నారు.



బీపీ చెక్ చేస్తున్న సిబ్బంది

మెరుగైన సేవలు అందిస్తున్నాం..



ఆరోగ్య కేంద్రానికి వచ్చిన వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. బాధితులను పరీక్షించి వచ్చిన రిపోర్టుల ఆధారంగానే వైద్యం అందిస్తున్నాం. అప్పుడప్పుడు మందుల కొరత ఏర్పడితే వెంటనే తెప్పించే ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లా కేంద్రం అయినప్పటికీ ఈ సెంటర్‌కు ఎక్కువగానే వస్తుంటారు. సిబ్బందితో వివిధ రకాల ఆరోగ్య కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగిస్తున్నాం.

– డాక్టర్ ఎస్.లక్ష్మీలోహిత, ఆరోగ్య కేంద్రం వైద్యురాలు

సమస్యలపై కమిషనర్‌కు వినతి

ఖమ్మం మామిళ్లగూడెం/ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోన 25వ డివిజన్‌లో నెలకొన్న సమస్యలపై శనివారం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు డివిజన్‌వాసులు వినతి పత్రం అందజేశారు. ఖమ్మం గాంధీ పార్కు ఎదుట ఉన్న అద్దంకిబజార్‌లో మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు చేసి రోడ్డును పునర్నిర్మాణం చేయకపోవడంతో నీళ్లు నిలిచి ఇబ్బందిపడుతున్నారని, మురుగు కాల్వల మీద చాంబర్లకు చాలా వరకు మూతలు పగిలిపోయి రోడ్డు మీదకు చెత్త వస్తున్నట్లు తెలిపారు. వినతి అందించిన వారిలో 25వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి పూర్ణ, బి.శ్రీనివాసరావు, ఎస్.రాధాకృష్ణ, ఎ.గిరిబాబు, షేక్ ఖాజా, ఆర్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని 58వ డివిజన్ కార్పొరేటర్ దోరేపల్లి శ్వేత కమిషనర్‌ను కలిసి డివిజన్‌లో రోడ్లు, డ్రెయిన్ల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ దోరేపల్లి శ్వేత , తదితరులు

రహదారి తవ్విన ఘటనపై ఎంపీడీఓ విచారణ

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురంతండాలో మురుగు నీరు మళ్లించేందుకు ప్రధాన రహదారిని తవ్వి వదిలేసిన ఘటనపై గ్రామస్తులు చేసిన ఫిర్యాదు మేరకు ఎంపీడీఓ ఎం.యర్రయ్య శనివారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వాహనాలు రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కార్యదర్శిని ఆదేశించారు. కాగా గ్రామానికి చెందిన కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి ఎంపీడీఓను కలిసి వివిధ సమస్యలపై వినతి పత్రం అందించారు. తన ఇంటి ముందు చెత్త వేయకుండా చూడాలని, మురుగు తరలించేలా కల్వర్టు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్, కార్యదర్శి గోపిక, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అలాగే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించి కేంద్రాలలో అందిచే సేవలపై ఆరా తీశారు. అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులు శర వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోపిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.


పెండింగ్ బకాయిలు చెల్లించాలి

కామేపల్లి: ఉద్యోగ ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కట్ట శేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం పీఆర్‌టీయూ మండల క్యాంపెయినింగ్‌లో భాగంగా పలు పాఠశాలలను సందర్శించిన సందర్భంగా వారు మాట్లాడారు. బదిలీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు పేస్కేల్ మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుత్తా శ్రీనివాసరావు, గుడిపూడి శ్రీనివాసరావు, పి.రాములు, టి.వెంకన్న, శశికళాధర్, ముజాహిద్, కోటేశ్వరమ్మ, నిర్మల, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

నేలకొండపల్లి: మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఏఓ డి.అరుణకుమారి శనివారం తనిఖీ చేశారు. మండలంలోని మంగాపురంతండా, నేలకొండపల్లి, చెరువుమాధారంలోని పలు దుకాణాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దుకాణాల్లో కొనుగోలు చేసిన ప్రతీ వస్తువుకు రశీదు ఇవ్వాలన్నారు. ఆమె వెంట ఏఈఓలు ఉన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు వివాహిత..



కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న శ్రీనివాసరావు

ఖమ్మంఅర్బన్: నగరంలోని అన్నం ఫౌండేషన్‌లో ఆశ్రయం పొంది మతిస్థిమితం కోల్పోయిన ఓ వివాహిత ఆరోగ్యం కుదుటపడి తన వివరాలు తెలపడంతో ఆశ్రమ బాధ్యుడు అన్నం శ్రీనివాసరావు శనివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. గత రెండేళ్ల క్రితం కూసుమంచి పోలీస్ స్టేషన్ పరిధిలో మతి స్థిమితం కోల్పోయి తిరుగుతున్న లక్ష్మీ తిరుపతమ్మను పోలీసులు ఖమ్మం అన్నం ఫౌండేషన్‌కు తరలించారు. ఇటీవల కోలుకుని తన పేరుతో పాటు ఏపీ రాష్ట్రంలోని రేపల్లె దగ్గర నిజాంపట్నం అని చెప్పింది. వాటి ఆధారంగా అక్కడి పోలీసులకు సమాచారం అందించి ఫౌండేషన్ అంబులెన్స్‌లో నిజాంపట్నం తీసుకెళ్లి పోలీసుల సమక్షాన ఆమె అన్న ఈగ అర్జున్‌కు అప్పగించారు. ఈమెకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఈమేరకు ఫౌండేషన్ సభ్యులను పోలీసులు అభినందించగా, ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంరూరల్/ఖమ్మంవ్యవసాయం: ఖమ్మంరూరల్ మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్ సబ్ స్టేషన్ పరిధిలోని తల్లంపాడు వ్యవసాయ ఫీడర్ మరమ్మతుల కారణంగా నేడు(ఆదివారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ క్రాంతిసింహ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఏదులాపురం, తెల్దారుపల్లి, మద్దులపల్లి, పొన్నేకల్, తల్లంపాడు అంతరాయం ఉంటుందని, అలాగే జలగంనగర్ ఫీడర్‌లోని పెదతండా పంచాయతీలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతున్నారు.అలాగే నగరంలోని 33/11 దానవాయిగూడెం సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న సారధినగర్, వాటర్ వర్క్స్, రాజీవ్ గృహకల్ప 11 కేవీ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–1 ఏఈ ఎం మౌలిక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో సారధినగర్, వెంకటేశ్వరనగర్, పద్మావతినగర్, జూబ్లీక్లబ్ రోడ్, షిప్ హౌస్ లైన్లు, బైపాస్ రోడ్, వాటర్ వర్క్స్, గణేష్ నగర్, మేకల నారాయణ బోర్డు, కామంచికల్, దారేడు లైను తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నేడు 'రాయల' సంస్మరణ సభ

ఖమ్మంమయూరిసెంటర్/రఘునాథపాలెం/కూసుమంచి: నగరంలోని ఎస్‌ఆర్ గార్డెన్స్‌లో నేడు(ఆదివారం) జరిగే సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్, కేంద్ర కమిటీ సభ్యుడు రాయల చంద్రశేఖర్ సంతాపసభను జయప్రదం చేయాలని మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవుల అశోక్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ ఒక ప్రకటనలో కోరారు. అలాగే కూసుమంచి మండలం పాలేరు, ముత్యాలగూడెం గ్రామాల్లో నిర్వహించిన రాయల సంతాప సభలో మాస్‌లైన్ (ప్రజాపంథా) పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య, కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు, రఘునాథపాలెం వేపకుంట్లలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల కార్యదర్శి లక్ష్మణ్ చంద్రశేఖర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో కె.నర్సయ్య, రామనాథం, రామయ్య, పోటు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, గురువారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం

ఖమ్మంమయూరిసెంటర్/ ఖమ్మం సహకారనగర్/ కూసుమంచి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోళ్ల లక్ష్మీనారాయణ, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి మస్తాన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పానుకుల సుధాకర్, పీడీఎస్‌యూ యూనివర్సిటీల జాతీయ కన్వీనర్ ఎస్.నాగేశ్వర్‌రావు, విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర నాయకుడు సి.బాబురావు, జిల్లా అధ్యక్షుడు ఎస్.విజయ్‌లు ఆరోపించారు. శనివారం ఖమ్మం, కూసుమంచిలో బడ్జెట్ కేటాయింపులను నిరసిస్తూ ర్యాలీలు, నిరసన ప్రదర్శన చేపట్టి బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని, పోరాటాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో పీవైఎల్, పీడీఎస్‌యూ, టీపీటీఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సాయిరాం, నవీన్, ప్రవీణ్, కీర్తి, శ్రావణి, ఎన్.ఆజాద్, బి.నరసింహారావు, కాంపాటి పృథ్వి, ప్రవీణ్, సురేష్, వెంకటేష్, సుమంత్, ఉమాశంకర్, సర్వేందర్, ఏవీ నాగేశ్వరరావు, సురేష్, మస్తాన్, మల్లయ్య, వెంకటేశ్వర్లు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



కూసుమంచి: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

సింగరేణి ప్రైవేటీకరణపై ఉద్యమం

ఖమ్మంమయూరిసెంటర్: బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి నేరుగా కేటాయించాలని, వేలంపాట ఆపాలని సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యాన నిర్వహించే సింగరేణి పరిరక్షణ యాత్రకు తమ సంఘం మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మ విష్ణువర్ధన్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సంఘ ప్లీనంలో సాయిబాబు మాట్లాడారు. సంఘ జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరావు, నాయకులు యర్రా శ్రీకాంత్, సీహెచ్.విఠల్, పి.మోహన్‌రావు, తిరుమలచారి, పి.రమ్య, జిల్లా ఉపేందర్, బండారు యాకయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యల వలయాలుగా సంక్షేమ హాస్టళ్లు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచడంతో పాటు ప్రభుత్వ వైద్యాధికారులను నియమించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ ఆధ్వర్యాన ఎస్సీ ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో సమస్యలపై అధ్యయనం చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నిత్యావసరాల ధరలు పెరిగినా.. పాత కాలం ధరలతోనే మెస్ చార్జీలు విడుదల చేస్తున్నారని, సురక్షిత మంచినీరు కూడా లేదన్నారు. సమస్యల వలయాలుగా మారిన హాస్టళ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు బొట్ల సాగర్, గుమ్మడి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవం

తిరుమలాయపాలెం/ఖమ్మంరూరల్: తిరుమలాయపాలెం పీహెచ్‌సీ, లయన్స్ క్లబ్ ఖమ్మం ఆధ్వర్యాన శనివారం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటి గ్రామ సమీపంలోని పులిగుట్ట ప్రాంతంలో సీడ్ బౌల్స్ చల్లారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, కార్యదర్శి గెల్లా శ్రీరామ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృపా ఉషశ్రీ, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖమ్మంరూరల్ మండలంలోని పోలేపల్లిలో గల కేంద్రీయ విద్యాలయంలో ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ విద్యాలయ సిబ్బంది, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పాములు పట్టే నిపుణుడు గోపి పాములపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీఓ మంజుల, విద్యాలయ ప్రిన్సిపాల్ కవీంద్రరాయ్, సూర్యనారాయణ, రాధాచైతన్య, నరేంద్ర, అటవీశాఖాధికారులు సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని ఎన్నెస్పీ క్యాంప్‌లో ఉన్న గిరిజన విద్యార్థుల సెల్ఫ్ మేనేజ్‌మెంట్ హాస్టల్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, బీ వసతిగృహం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని తెలంగాణ గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని హాస్టల్‌లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం, డివిజన్ కార్యదర్శి భూక్యా కృష్ణ నాయక్, సంఘం నగర నాయకుడు భూక్యా ఉపేందర్‌నాయక్ మాట్లాడుతూ.. హాస్టల్‌లోఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. ఆగస్టు 9న గిరిజన భవన్‌లో జరిగే ప్రపంచ ఆదివాసీ గిరిజన దినోత్సవాన్ని జయప్రదం చేయాలన్నారు. అనంతరం గిరిజన వసతి గృహ కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్ష, కార్యదర్శులుగా మాలోత్ శ్యామ్, భూక్యా గాంధీ నాయక్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కారం ప్రశాంత్, పాల్ ప్రకాష్, ఎం.శ్రీను, ఇస్లావత్ వెంకటేష్, వెంకట్, ధరావత్ మోహన్, భూక్యా హరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ అధికారుల బదిలీ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థలో టౌన్‌ప్లానింగ్ విభాగంలో పని చేస్తున్న అధికారులు బదిలీ అయ్యారు. ఏసీపీ సాయిరామ్ మహబూబాబాద్‌కు, టీపీఎస్‌లు ప్రశాంత్ వరంగల్‌కు, ప్రస్తుతం ఖమ్మంలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్న తేజస్వీ ఖమ్మంకు బదిలీ అయ్యారు. ఇక మెప్మా ఏఓగా శ్రీకాంత్, సీనియర్ అసిస్టెంట్‌గా రమేష్‌లు బదిలీపై వచ్చారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

నేలకొండపల్లి: కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం ఇఫ్టూ మండల అధ్యక్షుడు షేక్ యాకూబ్‌హుస్సేన్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు తమ హక్కులు కాపాడుకోవటానికి రాజకీయంగా చైతన్యవంతం కావాలని సూచించారు. ఈ నెల 29న నేలకొండపల్లిలో జరిగే సంఘం మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రాజపుత్ర జనార్దన్‌సింగ్, పగిడికత్తుల సాలయ్య, పిచ్చయ్య, శ్రీనివాసులు, వెంకటేశ్వరరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి ధర్నాను జయప్రదం చేయండి

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండల కేంద్రంలో మంజూరైన వంద పడకల ఆస్పత్రి ఇక్కడే కొనసాగించాలని, నిర్మాణ పనులను ప్రారంభించాలని కోరుతూ అఖిలపక్షాల ఆధ్వర్యాన ఈ నెల 29న జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. శనివారం చేపట్టిన 5వ రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, మాస్‌లైన్ నాయకులు తిమ్మిడి హన్మంతరావు, బీఎంపీ జిల్లా అధ్యక్షులు మట్టి దుర్గాప్రసాద్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన పాఠశాలలు..



స్మార్ట్‌కిడ్జ్‌లో బోనాల వేడుకలు



త్రివేణిలో..

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలైన బోనాల పండగ సంబరాన్ని నగరంలోని స్మార్ట్‌కిడ్జ్, త్రివేణి పాఠశాలల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్మార్ట్‌కిడ్జ్ పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, త్రివేణి పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి మాట్లాడుతూ.. తెలంగాణ పండగల విశిష్టతలను తెలియజేసేలా పాఠశాలల్లో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో స్మార్ట్‌కిడ్జ్ పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాళ్లు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'రెజొనెన్స్ శ్రీనగర్'లో మెహందీ వేడుకలు

నగరంలోని శ్రీనగర్‌కాలనీలోని రెజొనెన్స్ పాఠశాలలో మెహందీ వేడుకలను (హెన్నాజోల్) శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కృష్ణవేణిలు మాట్లాడుతూ.. ఆషాఢమాసంలో తెలుగువారందరూ ఎంతో ఇష్టంగా గోరింటాకు పెట్టుకుంటూ కుటుంబ సభ్యులందరితో ఆనందాన్ని పంచుకుంటారని, మెహందీ విశిష్టతను విద్యార్థులకు వివరించారు.



వేడుకలో డైరెక్టర్లు శ్రీధర్‌రావు, కృష్ణవేణి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824
రమేష్, ACO - 9059115968
ఖమ్మం ఎన్. ఉపేందర్ - 99591 24151
మధిర వీరబాబు - 98498 64638
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990
సత్తుపల్లి జి. బాబు - 79979 58225
వైరా ఐ. రాందాస్ - 98898 81843
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

ఎన్. శేషయ్య - 99121 99148
జి. నర్సింహారెడ్డి - 97054 44181
ఎస్.కె. పాషా - 97054 44182
పి. నందకుమార్ - 90102 99957